పిచ్చికమ్మ

రాయసం వేంకటశివుఁడుగారు

౧

శోకమునమునింగియుండు జనులకప్పటికిని ప్రొద్దుపోదు! మనస్సునావరించియుండు దుఃఖతిమిరము పగలు వెలుఁతురును, రాత్రి కూర్కును కంటినుండిపారఁద్రోలి, అహర్నిశలకభేదముగలిపించుచుండును. అట్టి మనుజుల యింద్రియజ్ఞానము మొనవాఁడియుండును. కనులుచూచుచునే చూడకుండును. చెవులువినుచునే వినకుండును. దైవోపహతుఁడైన యావ్యక్తిమీఁద లోకమెల్ల సత్యాగ్రహముపూనినట్లుగ, సామాన్యజనులను రంజింపఁజేసెడి సృష్టిక్రమమేవానిమనస్సున నేమార్పును చేయదు, ఏమాత్రము సంతోషమునుగలిగింపదు.

మీనాక్షి యిప్పుడిటులేల శుష్కించియున్నది? పాలిపోయినబుగ్గలు, తేలిపోవుచరణములు, నడికట్టు, నులకమంచము,—ఈమెబాలెంతరాలని చెప్పకయే చెప్పుచున్నవి! పాలసముద్రమునుప్పొంగించు బాలచంద్రునివలె జననికి నేత్రోత్సవము సలుపు శిశువచటనెందునులేదే! ఓహో, జ్ఞాపకమువచ్చినది. చందమామవలె వదనబింబమువెలింగెడి మీనాక్షిబాలిక, పుట్టిననెలలోనె చనిపోయెను! ఆశిశువును గుఱించినవిచారమున పాపమాతల్లిమనస్సు రేయింబగళ్లుకళవళించుచున్నది! రూపురేఖావిలాసములతో నొప్పెడియాచక్కనిచుక్క, కన్నతల్లికడియాసలుగొలిపి, తుదకు సూర్యోదయసమయమందలి వేగుఁజుక్కయైపోయెను! చాలుఁజాలును సంతానపుసంబరము! మరలమీనాక్షి నలుగురిమొగమును జూడఁగలదా? చిన్నికూఁతుని జీవితముతోనెయా సుదతిసంతోషము తెల్లవాఱిపోయెను. ఇంకముందుతానెపుడును, మందహాసమైనఁజేయక, సతతము తనమృతబాలికనుగూర్చియె తలపోయుచు, దలవాల్చి, దినములుగడుపుచుండునని మీనాక్షితనమనస్సున నిశ్చయించుకొనెను!

౨

పిచ్చికపిల్ల

పుత్రశోకార్తకావుననే యాయబలకిపుడు చేరువపెరటిలోని చెట్టుమీఁదిపిట్టలధ్వనులు వినరాకున్నవి. తనగోడవరెు తనకుసరిబోయి, చింతలోమునిగియున్న యాదీనవదనకు పక్షులరవములజోలియేల? కాకులకూఁతల మధ్యకిచకిచమను నొకచిన్నయార్తనాదము అపుడపుడువినవచ్చుచుండెను. కాకులేదైన పిట్టనెత్తికొనివచ్చినవా? చూచుచునే తనపిల్లలనుగోలుపోయిన యాతల్లికి, పక్షులరక్షణతోఁ బ్రసక్తియేమి? ఇట్లుతలఁచి వైరాగ్యముమాని యావనితయూరకకూర్చుండెను. కాని, చిన్నగొంతుకచప్పుడు హెచ్చి, యామెను పెరటిలోనికడుగుపెట్టునట్టుగ త్వరపెట్టెను!

ఒకపుడు మనముబుద్ధిపూర్వకముగఁ జేసికొనిననియమములు నిశ్చయములును వివేకరహితములుగను, అవిచారితముగఁజేసినవి అత్యుత్తములుగను బరిణమించును. మీనాక్షి పెరటిలో నడుగుపెట్టినసమయమందే, చెట్టుమీఁదికాకులనుండి తప్పించుకొని, నెత్తురుగ్రక్కుపిచ్చికపిల్లయొకటి నేలపడెను! ఆయిల్లాలొకక్షణ మేనియుపేక్ష చేసినచో, కాకులాయెరనునోటవేసికొని పోయెడివియె! కాని యాపుణ్యవతి, చప్పట్లుకొట్టి, ముందుకుఁబరుగిడఁగనే కాకులుచెల్లాచెదరైపోయి, చెట్లమీఁదవాలి చూచుచుండెను. ఇంతలోమీనాక్షి, యాపిచ్చికకందునుజేరఁగొని దానిని తనగదిలోనికెత్తి తీసుకొనిపోయెను.

పాపమాచిన్నపిట్టగుండియలు భయాతిరేకమున తటతటమని కొట్టుకొనుచుండుట మీనాక్షిగనిపెట్టెను! ఈమానిసిచేతులలోఁ దనకేమిమూఁడునోయని పుల్కుపుల్కున పక్షిపిల్లయాకలికి కనులదెసఁజూచుచుండెను!

నిముసముక్రిందటనే వైరాగ్యమూనిన యావేదాంతిని హృదయమిదిచూచి కరఁగిపోయెను. ఆసెలఁతకుఁగనుల నీరుగ్రమ్మెను—పక్షిరెక్కలక్రింది నెత్తురుబొట్లు గుడ్డతో నొత్తివైచి, దానినక్కునఁ జదిమిపట్టి, ఎట్లైన దానిని రక్షింపవలయునని యుద్యమించెను. తనకెన్నికష్టములు వాటిల్లినను, ఆచిన్నపిట్టను గాపాడవలెనని యాదయార్ద్రస్వాంత నిశ్చయించుకొనెను.

ఒక జీవినికాపాడ నెంచుట సులభమే కాని, సంరక్షించుటమాత్రము కష్టసాధ్యము. బాల్యావస్థనుండు ప్రాణిపరిపోషణము దుస్సాధ్యము! సృష్టికార్యక్రమ మెంతటివిచిత్రమో కాని, తల్లి పెంపుదప్పిన శిశువును క్రమముగ సంరక్షణచేయఁగల మాఱుఁదల్లి లోకమునఁ గానఁబడదు! దీనికితోడు, మనుష్యజన్మమెత్తిన స్త్రీయొక పిచ్చికపిల్లకెట్లు పెంపుడుతల్లి కాఁగలదు? ఐనను, ఆలోచించినకొలఁదిని, ఆపిచ్చికకందువను రక్షింప మీనాక్షికి పట్టుదలహెచ్చెను. శిశువియోగదుఃఖమందెడియాతల్లికి, మాతృవియుక్తయైన యాపిచ్చికకందువమీఁద వెల్లిప్రేమ వాలెను! ప్రేమయొక జాతియున్మత్తతయని కవులువర్ణింతురు. పచ్చిబాలెంత లిట్టిపిచ్చిపనులు చేసి, యారోగ్యము చెడఁగొట్టుకొనరాదని తలిదండ్రులువారించిరి. కాని మీనాక్షికి, తనపిల్లయే రెట్టలో ఆపక్షిరూపమువచ్చి తనశరణుఁజొచ్చెనని భ్రమగలిగెను! కావున, కంటవత్తినిడుకొని యాపిచ్చుకపిల్లను బోషింపనామె యుద్యమించెను.

ఒక్కొకతఱి ఎంతటిస్వల్పకార్యమునకైన పెద్దయాటంకము లాసన్నమగుచుండును! పిచ్చికపిల్లను బెంచనెంచిన మీనాక్షికి మతిచంచలించెనని చెలికత్తెలు పరియాచకముచేసిరి. చనిపోయిన శిశువునకై వగచెడి తనయకు పిచ్చికపిల్ల పెంపు మఱింతవెతనుబెంచునని తల్లిభయము. దేహమున మొదలుసత్తువలేని తనసుత కల్పించుకొనినయీపనిచే నీరసము హెచ్చి, మూలపడునని తండ్రిభీతి. ప్రమాదికి పరోపకారబుద్ధివహించి మంచమెక్కుట అనుచితమని పెద్దలవారింపు. కన్నపిల్లనుగోలుపోయి, తుదకు పిచ్చికపిల్లమీఁద భ్రమవాఱిన యాబాలెంతను, ఇరుగుపొరుగులయమ్మలక్కలు వెక్కిరింపసాగిరి. మీనాక్షియీపనిని జేయలేదనికొందఱు, చేయరాదనికొందఱును, ఆవాడగల యాఁడుపుట్టువులు పరిపరితెఱఁగులఁదలపోసిరి.

3

పక్షిబస!

ఇతరులవారింపులు మీనాక్షిమనోనిశ్చయమును మఱింతదృఢపఱచెను. ఎట్లైన వానోరులేని పిట్టను బెంచవలెనని యాపడతిపట్టుపట్టెను. అపవిత్రపరోపకారసౌధమునకు, పవిత్రగృహనిర్మాణము మొదటిసోపానము! మనుష్యశిశువునకేయుయ్యేలయో సిద్ధముచేయవచ్చునుగాని, పిచ్చికపిల్లకే యిరవుసమకూరునని యాయిల్లాలుతల్లడిల్లెను. వెనుకటిచిలుకపంజరమొకటి తమ యటుకమీఁదనుండుట ఆమెకపుడుజ్ఞాపకము వచ్చెను. అది తీసిచూడఁగా, త్రుప్పుపట్టియుండెను. కొన్నికమ్ములువిఱిగిపోయెను. తక్కినవిరొడ్డమై యుండెను. మీనాక్షియోపికతో దానినిశుభ్రపఱచెను. వెదురుబద్దలతో పంజరమును బాగుచేసెను. ఆసాయంకాలముచెలికత్తెలు వీరింటికివచ్చిచూచి, "సెబాసు, మీనాక్షీ! నీపెంపుడుకూఁతును పాలకిలోఁగూర్చుండబెండ్లికూఁతునిజేసినావె! ఎన్నిసాధనములుచేసి, సదుపాయములు కలిపించినావు!" అని యాశ్చర్యపడిరి.

౪

పిచ్చికపిల్లకుమేతయేమి?

మీనాక్షికంతట నింకొకకఠినసమస్యగానవచ్చెను! పిచ్చికపిల్లకిప్పటికి వాసమేర్పడెనుగాని, గ్రాసము మాటయేమి? ఆరగింపువిషయమున, పిచ్చికపిల్ల బిడియపడు పెండ్లికూఁతురాయెను! అదియేమి తినును?

ఆఁకలిబాధతో 'చిర్పు' 'చిర్పు' మని సదా యఱచుచు, మీనాక్షి యేతినుబండము బెట్టిచూచినను పిట్ట మూచూచి పెదమొంగము పెట్టుచుండెను! పిచ్చికపిల్లకేమి మేఁత పెట్టవలెనని యావాడఁగలయింటింటికిని మీనాక్షి చిన్నచెల్లెలుపోయి యడిగినప్పుడు, దానినిజూచి నవ్వుచుండురే కాని, ఎవరును తగినసమాధానము చెప్పలేకుండిరి! ఓపికవీడక మెదుకులు, నానబెట్టినగింజలు, మొదలగువస్తువులెన్నెన్నియో తెచ్చిచూపి, మీనాక్షి యెటులో దానికడుపునిండించెను!

కొన్దిదినములవఱకు వారియింటికేఁబోయి చూచినవారికాశ్చర్యము గొలుపుచు, పంజరమునందలి పిచ్చిక పిల్ల బలముపట్టి యాడుకొనుచుండెను! ఇపుడు దానికే వేళలందే మేఁత వేయవలెనో పెంపుడుతల్లికనుభవ వేద్యమే! ఆపిట్టకాహారపానీయములు సమకూర్చుట, దానిగిన్నెలుతోముట, పంజరము బాగుచేయుట మొదలగు చిన్నపనులతోనె మీనాక్షికిపుడు కాలక్షేపము! మీనాక్షితనమృదువగు చేతులతో పట్టునంతనె. యాపిట్ట యీలునిమురునపుడు, చెరలాటములాడు పక్షిముక్కులతో తల్లివ్రేళ్లనుపొడుచుచుండును! తనప్రక్కల నామె మేనికిరాయుచుండును. జననిముందునృత్యమాడుచు, 'చిర్పు' 'చిర్పు'మని సంగీతముపాడుచుండును. పుత్రశోకార్తయగు మీనాక్షియిట్లు పక్షిపరిచర్యలలోఁ గాలముఁబుచ్చుచు, మెల్లమెల్లగ తనదుఃఖమును మఱచిపోసాగెను. పందిరికొయ్య నెగఁబ్రాకుపొదుతీఁగవలె ఆకోమలిడెందమందలి పుత్రమోహము, కనులముందరి పిచ్చికపిల్లపైఁబ్రసరించి, ఆకారణమునఁ జిగిరింపఁదొడఁగెను! పిచ్చికప్రాణముండి పెదమొంగము పెట్టు నిష్ప్రకణమువలె, ప్రేమపూరితమగు నాలేమమదినుండి శోకవహ్ని యొగిరిపోయెను! ఆశోత్సాహపూరితమగుమనస్సు తోఁగాంపురములను జేమముదరికిఁ జేరనీయకుండును! మీనాక్షికి శరీరమున క్రొత్తనెత్తురుపట్టెను. ఆమె సుందరవదనమిపుడు నూతనకాంతులతో దేజరిల్లుచుండెను. వారియింటికి పెత్తనములకువచ్చి పరామర్శచేసిట మీనాక్షిమనసున నానాటనిగురుగప్పుచుండెడి దుఃఖాగ్నినికెలికి రగులఁజేయుచుండెడి యంగనామణులు, తమసానుభూతి కిపుడవకాశములేక, తమప్రణాళికను మార్చుకొని, దినదినప్రవర్ధమానయగుచున్నెడి యాసుదతి పెంపుడుకూఁతుని సుఖస్థితికభినందనములు గుప్పింపసాగిరి! నేస్తురాండ్రు నిరతమును, "మీనాక్షీ! నేఁడేమీ నీపెంపుడుకూఁతుని క్రొత్తవిద్యలవార్తలు!" అని కుశలప్రశ్నలు కురియించి, యాపాలఁతిమనంబునం బ్రమోదంబుం బెంపొందించుచుండిరి. నివారితమైన వ్రణముమచ్చయై మాసిపోవుచందమున, ఈక్రొత్తవ్యాసంగమువలన నామానిని మనస్సునందలి శోకకళంకము కాలక్రమమున రూపడంగెను.

ఆయురారోగ్యములతో విహరించెడి వ్యక్తియీయాలోకమున సుఖభోక్త! ఈతనిభోగోపభోగములకే నింగినిసూర్యుడు వెలుంగుచున్నాఁడు. వెలుచంద్రికతో మందహాసములువల్పుచున్నవి. చెట్లు తీఁగలును, తమ పుష్పసౌరభములతో వానినాసికమురంజించెడి భృత్యవర్గము. నదులు పర్వతములును వానికి నేత్రపర్వమొనరించెడి వినోదవస్తువులు. మలయమారుతపరిచారిక వానిని సేదదేర్చుటకే రాత్రియంతయు వీవనవీచుచున్నది!

ఎన్నియైశ్వర్యములున్నను, ఆయురారోగ్యభాగ్యములేనివాని కేభాగ్యమునులేదు! ఉద్యానవన సదృశమగు ధరణీతలము, రోగసంకలితునకు ఘాతుకమృగసాంద్రమగు ఘోరారణ్యము. పూలపాన్పుఁబోలిన యీభూతలము, ఆయుర్విహీనునికి శ్మశానవాటికయగుచున్నది. లోకపరిచారికయగు ప్రకృతి, వ్యాధిగ్రస్తునికి కొఱకొఱలాడెడి యధికారిణియౌ! గడువుపూర్తియైన మందభాగ్యునికది వేఁడికన్నులవేఁటకత్తె!

ఇపుడీవసంతకాలమున మలయమారుతమువీచుచుండఁగ హాయిగనీచెట్టునీడ విశ్రమించు సుందరియెవరు? కొలఁదికాలముక్రిందట కూఁతునుగోలుపోయిన మీనాక్షియే. శిశువునుబాసి శోకనొందెడియాసుదతి, దుఃఖ జీర్ణచర్మమును దిగఁద్రోచి, నూతనప్రేమపల్లవముఁదాల్చి, ఆరోగ్యానందముల వలరారుచున్నది! కన్నకడుపు

నకు, పెంచిన చేతులకును, దుఃఖమెపుడును పూర్తిగమఱపురానిమాటసత్యమే. "అపుత్రికయె జీవించియుండిన నే నెంతటియదృష్టవంతురాలను!" అని మనోసీమనుండి పూర్తిగదుఃఖము తొలఁగకుండెడి యాదీనపలుమాఱు కంటఁదడిపెట్టుచునేయుండును. కాని, చనిపోయినశిశువుమాట యసత్యము, బ్రదికివర్ధిలుచున్న యీపిచ్చికయె నిజము—అనియామెమనస్సును దిట్టపఱచుకొనియెను. పిచ్చికపిల్లనుజూచుకొని యిపుడావనిత దినములు పుచ్చుచున్నది. అదియె యిపుడీమె కేడుగడ!...

భద్రమునకై రాత్రిపంజరముననుంచినను, పగలు మీనాక్షీపిచ్చికను బైటవదలివేయుచుండును. ఇపుడది ఱెక్కలుపెట్టి, పిక్కటిలియున్నది. పిచ్చిక, చెట్లమీఁదికెగిరి యాహారముతినుచు, అప్పుడప్పుడు తల్లిమీఁదభ్రమవాతినప్పుడు క్రిందికివచ్చి, ఆమెవేయు గింజలుతినుచు, ఆమెహస్తస్పర్శసుఖమనుభవించుచుండెను. కాకులనోటఁబడనున్న యానెత్తురుకందు, ఇపుడీపెద్దపిట్టయై విహరించుచుండుటకుఁ దల్లిమిక్కిలి ముదమందుచుండును. ఎల్లకాలమీపిచ్చిక తనచెంతనుండి తనకానందముగలిగించుచుండునని యావెఱ్ఱితల్లి తలపోసి, వెఱ్ఱిసంతసమున ముఱియుచుండెను.

చనిపోయినబాలికనుగుఱించి మనస్సునెటులో సరిపెట్టుకొని, ఉన్నపిట్టనుజూచుకొని యువ్విళులూరెడి యాయుపిదయానందమునకు విధి యసూయఁజెందెనాయనునట్లుగ నిపుడొక యుదంతము సంభవించెను! ఎప్పటివలెనే పిచ్చికయొకచేరువ చెట్టుమీఁదికెగిరిపోయి మేఁతమేయుచుండెను. అంతకొంతసేపటికాదిక్కునుండి "కిచకిచలు" వినవచ్చెను. తనపిట్టకొఱకుఁ జూచుతల్లి కన్నులకపుడొక మగపిచ్చిక యాకారముగానవచ్చెను. అటులైనపిమ్మటతనపిచ్చిక తనయొద్దకువచ్చివాలునని తల్లితలంచెనుకాని యట్లుజరుగలేదు. కొంతసేపటికి తివ్వున రెండుపిట్టలు నింగికెగిరిపోయెను! ఎంతసేపుకనిపెట్టుకొని, ఎన్నిచోట్లవెదకినను, పాపము, మీనాక్షికిపిచ్చుక జాడగానఁబడలేదు! ఇపుడామె యేమిచేయఁగలదు?

౫

ఎడబాటు

మీనాక్షీపిచ్చుక యిలువెడలిపోయి యిప్పటికిఁ గొన్నిదినములయ్యెను. ఈరెండవయెడబాటు పాపమామెలఁతకు కడుదుస్సహముగనుండెను. మాయదైవముమరల తనశోధన పాలుచేయనేలయని యాపనితవిలపించెను. మరల తనముద్దులపిచ్చుకనుజూచి తనకరములతో దానిమృదుదేహమునిమురు భాగ్యముగాంతునా యని యాదీనావనితలపోసెను—మీనాక్షీసహచరులు తమనేస్తురాలినెటులోదార్ప వలయునోయెఱుఁగకుండిరి. ఊరఁగలయమ్మలక్కల వికటపరిహాసములకు మరల మీనాక్షిగుఱియయ్యెను. "మీనాక్షీపక్షి యత్తవారియింటికి వెడలిపోయినదా!" యనువారలహాస్యోక్తుల యాథార్థ్యమాయంగనకు సుబోధకముగాకుండెను.

౬

పక్షి దొరకుట

ఒకనాఁడు మీనాక్షి నీరెండలో చెట్టుక్రిందఁబండుకొని, పైకిఁజూచుచుండెను. పలుచనిమేఘమొకటి యాకాశపథమునఁగొమ్మలమధ్యనుండి కానవచ్చెను. కదలుచుండెడిది మేఘమైనను, వృక్షమెచలించుచుండునటులామెకంటికిఁదోఁచెను. అపుడంతచెట్టుమీఁద వాలినయొకపిట్టరూపమామెకుఁగానఁబడెను. అదియొక మగపిచ్చిక. అదితనపిచ్చికయైన నెంత యదృష్టమని యాతరుణితలంచుచుండఁగనే, వెంటనే వేఱొకపిచ్చికకూఁత వినఁబడెను. దానికంఠధ్వని మీనాక్షికిఁదెలిసినదియె! "పిచ్చికమ్మా!" అని యొక్కపెట్టున భావోద్రేకమునే నాకాంతయార్చెను. తివ్వున "పిచ్చికమ్మ" క్రిందికి దిగివచ్చి, ఱెక్కలతో తల్లిమేనునంటి [illegible]కొనెను.

తోడనె మీనాక్షి, పక్షిని చేతఁబట్టి, 'ఇదిగో నాపిచ్చికమ్మ వచ్చినది!" అని కేకరించి, దానిని ముద్దాడుచు, ఇల్లుచొచ్చెను.

ఆనాఁడు మీనాక్షికి పండుగదినము! ఆమెభాగ్యము పొగడుపొరుగువారికిని, అదృష్టము నభినందించు ననుచరులకును, వారియిల్లు నేఁడువిడిదియయ్యెను. మందన్నడును పిచ్చికను పంజరమునుండి విడువవలదని చెలికత్తెలు చెప్పినను, నోరులేనియాపక్షి స్వేచ్ఛ నరికట్టుటయు, దానిసంసారసౌఖ్యమునకంతరాయములుగలిగించుటయు పాపకృత్యములని మీనాక్షికిఁదోఁచెను. రాత్రియంతయును వారివాకిటఁగూసికూసి, మగపిచ్చుక వెడలిపోయి మఱునాఁడు ప్రొద్దున్న మరలవచ్చి, తనప్రేయసిని సంబోధింపసాగెను. అంతనారెండు పిచ్చుకలును చెట్టుమీఁద విహారములుసలిపెను. ఎక్కడకుఁబోయినను, అపుడపుడు "పిచ్చికమ్మ" పుట్టినింటికివచ్చి, తల్లియిడెడి సూడిదలవారగించి వెడలిపోవుచుండును. పిచ్చికమ్మ తనతల్లిచెంత నుండునంతసేపును కీచుకీచుమని యార్చుచు తానుమాత్రము అత్తదగ్గరకు రాకఠీవితో దూరపుకొమ్మనెక్కి కూర్చుండుమగపిచ్చికను జూచి, "ఆహా! ఏజాతియందును అల్లునిపోకడలిట్టివియేకదా!" యని మీనాక్షి యచ్చెరువొందుచుండును.

అంతకొన్నిదివసములకు మీనాక్షియింటిచాటున నొకపిచ్చుకగూడేర్పడెను. దానిలో పిచ్చికమ్మ తన గ్రుడ్లనుపొదిగి, పిల్లలనుజేసి, వానిని సంరక్షించుచుండెను. ఆదినములలో మిగులపాటుపడి, ఆఁడుపక్షి తన పిల్లలకెర తెచ్చిపెట్టుచుండును. తల్లిరాక కెదురుచూచు పిచ్చికపిల్లల చిన్నచంచువులను జూచుచును, ఎరదిను నపుడంతమకమునవని సన్నని గొంతులతోఁజేయు కిచకిచలువినుచును, మీనాక్షి ప్రొద్దుపుచ్చుచుండును. మీనాక్షి సహచరులిపుడు వినువార్తలామె కూఁతునిసంసారపుముచ్చటలె. తనకూఁతురుమంచిదెకాని, అల్లుఁడు సోమరియై, పిల్లలకు మేఁతసరిగాఁ గొనిరాకుండుటచే, భార్యాభర్తలకుఁ "గీఁచులాటలు" తఱచుగతటస్థించుచుండునని మీనాక్షి పలుకునపుడు, కొందఱు మూతివిఱుచుచు, కొందఱు ముసిముసినవ్వులునవ్వుచు నూఁకొట్టుచుందురు!

౭

పిచ్చికమ్మ వేఱింటి కాపురము

ఎల్లకాలము నిల్లటికము నుండనొల్లనియల్లుని ప్రేరణమునఁ గాఁపురమెత్తివేసిరాయనునట్టుగ, ఆచటక దంపతులంత స్థలాంతరమునకు వలసపోయిరి! కాని పూర్వపామరత్వమున పిచ్చుకమ్మ దారితప్పివచ్చినదాని వలె అప్పుడప్పుడు తల్లిదర్శనము చేయుచు, ఆరణములఁగొనిపోవుచుండును. కాని, కూఁతునిరాకపోకలంతకంతకడమగుచువచ్చి, ఇటీవలకొంతకాలమునుండి బొత్తిగనిలిచిపోయినవని మీనాక్షి కన్నీరొత్తుచు మిత్రులకుఁజెప్పుచుండును. ముదిమిని పిచ్చికమ్మ జ్ఞాపకశక్తియంతరించి పోవుటచేతనె పుట్టినింటికి రాకున్నదిగాని యది యెచటనో సేమముగనే యున్నదని నెచ్చెలులు మీనాక్షినోదార్చుచుందురు. మీనాక్షి తనపెంపుడు కూఁతునుగుఱించి తలంచుకొనునపుడు, పెంచినమోహమునఁ గంటతడిపెట్టుచున్నను, తనకూఁతురుపెరిఁగి పెద్దదియై, కృతకృత్యయయ్యెననియు, దానివంశము తామరతంపరయై మనుచున్నదనియును, గుర్తెఱిఁగి తృప్తియు మనశ్శాంతియుఁ గాంచియేయున్నది!

దైవానుగ్రహమున మీనాక్షికిటీవల మంచి సంతానముగలిగెను. తనపెంపుడు కూఁతుచలువయో తన సంతతిపెంపునకుఁ గారణమనిదలంచి, ఆమె పిచ్చికమ్మయెడ నధికానురాగము గాంచియున్నది. ఆమె పిల్లలు తమపెద్దయక్క "పిచ్చికమ్మ"నుగూర్చిన ముచ్చటలిప్పుడును ప్రేమాతిశయమునఁ జెప్పుకొనుచున్నారు.